వరద హోరు

గద్వాల, జూలై 23 : జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం తగ్గడం లేదు. మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో వరద భారీగా వచ్చి చేరుతున్నది. మంగళవారం రాత్రి ప్రాజెక్టుకు 1.65 లక్షల క్యూసెక్కుల వరద రాగా డ్యాం 36 గేట్లు ఎత్తారు. జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 9.657 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 7.682 టీఎంసీలకు చేరింది.

టీబీ డ్యాంలో..

అయిజ, జూలై 23 : కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నది. ఆల్మట్టి ప్రాజెక్టులోకి 1.50 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.., అవుట్‌ఫ్లోను 1.70 లక్షలకు పెంచారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ 129.72 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 91.928 టీఎంసీలుగా ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 1.50 లక్షల క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లోను 1.80 లక్షల క్యూసెక్కులకు పెంచారు. గరిష్ఠస్థాయి నీటి నిల్వ 37.64 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 27.927 టీఎంసీలుగా ఉన్నది. అలాగే టీబీ డ్యాంలోకి ఇన్‌ఫ్లో 87,439 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 15,230 క్యూసెక్కులుగా ఉన్నది. 105.788 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 93.542 టీఎంసీల నిల్వ ఉన్నది. టీబీ డ్యాం నుంచి ఆర్డీఎస్ ఆనకట్టకు బుధవారం వరద చేరుకుంటుందని, అక్కడి నుంచి సుంకేసుల మీదుగా శ్రీశైలానికి జలాలు చేరుకుంటాయని ఆర్డీఎస్ ఏఈ తెలిపారు.

శ్రీశైలానికి..

శ్రీశైలం, జూలై 23 : శ్రీశైలం జలాశయానికి మంగళవారం రాత్రి 1,15,315 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో పూర్తిస్థాయి నీటి నిల్వ 215 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 66.8398 టీఎంసీల నిల్వ ఉన్నది. కాగా, టీఎస్ పవర్‌హౌస్ నుంచి 25,426 క్యూసెక్కులను వినియోగిస్తూ విద్యుదుత్పత్తి చేస్తున్నారు.

జూరాలలో విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, జూలై 23 : జూరాల ఎగువలో ఐదు, దిగువన ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నది. సోమవారం అర్ధరాత్రికి ఎగువన 3.192 మి.యూ ఉత్పత్తి జరుగగా.. ఇప్పటి వరకు 16.415 మి.యూ ఉత్పత్తి జరిగింది. దిగువన 4.011 మి.యూ ఉత్పత్తి జరగగా.. మొత్తం 20.328 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగినట్లు ఎస్ఈ సుబ్బరామిరెడ్డి తెలిపారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ నిర్వహించిన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ సురభి వాణీదేవి



మాట్లాడుతున్న నాగ్‌అశ్విన్

మదనాపురం రైతు వేదికలో ఏఈవో స్పందనతో మాట్లాడుతున్న ఈ మహిళ పేరు గొల్ల బాలదేవమ్మ. మదనాపురం మండలం నర్సింగాపురం నివాసి. ఈమెకు రెండు ఎకరాల మూడు గుంటల వ్యవసాయ భూమి ఉంది. మదనాపురం ఎస్‌బీఐలో పట్టా పాస్‌బుక్ పెట్టి రూ.60వేల పంట రుణం తీసుకుంది. కానీ, ఈమెకు రుణమాఫీ రాలేదు. కారణాలు తెలుసుకునేందుకు రెండు రోజులుగా అవస్థలు పడుతున్నది. ఇంత మందికి వచ్చి తనకెందుకు రాలేదో చెప్పండి అంటూ మంగళవారం మదనాపురం రైతువేదికలో ఇలా వాకబు చేసింది. ప్రస్తుతం వచ్చిన రుణమాఫీ లిస్టులో మీ పేరు లేదని, వివరాలిస్తే ఉన్నతాధికారులకు వివరిస్తామని అధికారులు చెప్పడంతో చేసేదేమీ లేక వెనుదిరిగింది.

మండలం	మాఫీ అయిన రైతు కుటుంబాలు
అమరచింత	1,077
ఆత్మకూరు	1,277
చిన్నంబావి	1,796
ఖిల్లాఘణపురం	2,995
గోపాల్‌పేట	2,184
కొత్తకోట	2,925
మదనాపురం	1,588
పాన్‌గల్	3,030
పెబ్బేరు	2,172
పెద్దమందడి	2,453
రేవల్లి	1,285
శ్రీరంగాపురం	678
వనపర్తి	3,356
వీపనగండ్ల	1,592
మొత్తం	**28,408**

రుణమాఫీ మాయ

- అర్హత ఉన్నా వర్తించకపోవడంతో పలువురు రైతన్నల ఆందోళన
- బ్యాంకులు, అధికారుల వద్దకు పరుగులు
- మాకేదంటూ నిలదీత
- లోపాలను సవరించేది ఎప్పుడంటూ ఆగ్రహం
- వనపర్తి జిల్లాలో 10 వేలకుపైగా జాబితాలో లేని పేర్లు

వనపర్తి, జూలై 23 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల 18వ తేదీన రూ.లక్ష లోపు ఉన్న రైతులకు రుణమాఫీ ప్రకటించిన సంగతి విధితమే. అయితే బ్యాంక్ లెక్కలకు.. ప్రభుత్వం చేసిన రుణమాఫీ లెక్కలకు పొంతనలేక పోవడంతో అటు బ్యాంకర్లు.. ఇటు వ్యవసాయ శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కార్యాలయాలకు వచ్చే రైతులకు సమాధానాలు చెప్పలేక కొన్నిసార్లు దాటవేస్తున్నారు. రూ.2 లక్షలకు పైగా రుణాలున్న రైతులు ఇటువైపు చూడకపోగా, రూ.లక్ష లోపు మాఫీ కాని వారు లబోదిబోమంటున్నారు.

వనపర్తి జిల్లాలో రూ.లక్ష లోపు రుణమాఫీలో 28,613 మంది అకౌంట్లకుగానూ 28,010 రైతుల కుటుంబాలకు రుణ విముక్తికి అవకాశం కల్పించారు. ఇందుకోసం రూ.156.92 కోట్లు మాఫీ చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే వీటి సంగతి ఇలా ఉంటే.. ఇంకా రూ.లక్షలోపు రుణం తీసుకున్న రైతుల పేర్లు మాఫీ జాబితాలో లేకపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే లిస్టుల్లో పేర్లున్న వారికి సైతం బ్యాంకుల్లో మాఫీ డబ్బులు జమ కాలేదు. ఇలా రుణమాఫీ లిస్టుల తోపాటు ఇతర అవకాశం ఉన్న రైతులకు కూడా మాఫీ లిస్టులో పేర్లు లేకపోవడంతో ప్రభుత్వం గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేసింది. ఏఈవోల ద్వారా వీటిలోని తప్పిదాలను నమోదు చేసుకొని ప్రభుత్వానికి వివరించేలా చర్యలు తీసుకుంటున్నారు. రెండు రోజులుగా జిల్లాలోని ఏఈవోల ద్వారా కేవలం 58మంది రైతులకు సంబంధించిన ఫిర్యాదులు నమోదయ్యాయి. ఒకే కుటుంబంలో ఇద్దరికి రుణాలుండడం వల్ల రుణమాఫీ కొందరికి రాలేదని, ఒకే కుటుంబంలో ఒక రైతున్నా రుణమాఫీ రాని రైతుల వివరాలు మాత్రం తీసుకొని ప్రభుత్వానికి పంపిస్తామని ఏఈవోలు రైతులకు సెలవిస్తున్నారు.

తప్పిదాలతోనే తంటాలు..

అధికారులు చేసిన తప్పిదాలతోనే రైతులకు రుణమాఫీ తంటాలు వస్తున్నాయి. ఈ తప్పిదాల వల్ల జిల్లాలో ఇంకా రూ.లక్ష లోపు రుణాలున్న రైతులు దాదాపు 10వేల మంది ఉంటారని అనధికార అంచనా. అయితే వీరి కుటుంబాల్లో పంట రుణం రూ.లక్ష దాటితే తొలి విడుతలో రారని అధికారులు చెబుతున్నారు. అలాగే బ్యాంకుల్లో ఏర్పడ్డ సాంకేతిక లోపాలతో అనేక మంది రైతులకు సమస్య వచ్చి పడింది. వివిధ రకాల సమస్యలతో బ్యాంకుకు వెళితే.. వ్యవసాయ కార్యాలయానికి వెళ్లమని అధికారులు చెబుతుండటంతో రైతులకు అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులంతా ఏఈవోల చుట్టూ రుణమాఫీ కోసం చక్కర్లు కొడుతున్నారు. ఆధార్ కార్డులను పరిశీలించి వారు ఏదో ఒకటి చెబుతున్నప్పటికీ రైతులకు సంతృప్తి కలగడం లేదు. రుణ రిజిస్టర్‌లో ఒక పేరు.. ఆధార్‌లో మరొక పేరు ఉందంటూ అందుకే అమలు కాలేదని, వచ్చే విడుతలో మాఫీ వస్తుందని చెప్పి పంపిస్తున్నారు.

రుణమాఫీలో చెబుతున్న తిరకాసులు ఎప్పుడు తీరిపోతాయో.. సవరణలు ఎప్పుడు అవుతాయో.. మాకు రుణ విముక్తి ఎప్పుడు లభిస్తుందోనంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అర్హులకే వర్తిస్తుంది : డీఏవో

ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన వారికి రుణమాఫీ వర్తిస్తుందని డీఏవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. కొన్ని చిన్నచిన్న పొరపాట్ల వల్ల కొంతమంది రైతులకు సమస్య వచ్చినా వాటిని గుర్తించి ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. ఇప్పటికే జిల్లాలోని రైతు వేదికల్లో ఏఈవోల ద్వారా వివరాలను సేకరిస్తున్నామన్నారు.

మాఫీ కాలేదంటున్నారు..

మదనాపురం ఎస్‌బీఐలో రూ.50 వేలు అప్పు తీసుకున్నాను. రూ.లక్షలోపు ఉన్నోళ్లకు ప్రభుత్వం రుణమాఫీ చేసిందన్నారు. కానీ నాకు మాఫీ కాలేదు. బ్యాంకు, వ్యవసాయాధికారులను అడిగితే ఏదేదో చెబుతున్నారు. రుణమాఫీ అంతా గందరగోళంగా ఉంది. ఇంకా ఎన్ని రోజులు అధికారుల చుట్టూ తిరగాలో.

- గుజ్జల ఆంజనేయులు, రైతు, నర్సింగాపురం

బుజ్జి కారు సందడి

- పాలమూరులో 'కల్కి' సినిమా వాహనం

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 23 : కల్కి సినిమాలో హీరో ప్రభాస్ ఉపయోగించిన 'బుజ్జి కారు' పాలమూరులో సందడి చేసింది. గత నెల 27న ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన కల్కి చిత్రం భారీ విజయం దిశగా దూసుకుపోతున్నది. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బుజ్జి కారును ప్రదర్శనకు ఉంచారు. కల్కిలో హీరో ప్రభాస్ వినియోగించిన బుజ్జి కారు వీక్షించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కారును తిలకిస్తూ సెల్ఫీలు తీసుకొని సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. పట్టణంతో

కారును వీక్షిస్తున్న యువత

పాటు గ్రామీణ ప్రాంతాలనుంచి సందర్శకులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పాత డీఈవో కార్యాలయం నుంచి ఎర్రసత్యం చౌరస్తా వరకు ట్రాఫిక్ అంతా జామ్ కావడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. సినిమాలో కంటే కారును నేరుగా చూడడం ఎంతో సంతోషంగా ఉందని ప్రేక్షకులు చర్చించుకుంటున్నారు.

దర్శకుడికి ఘన స్వాగతం..

కల్కి సినిమా విజయవంతం కావడంతో దర్శకుడు నాగ్‌అశ్విన్ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చేరుకొని ప్రభాస్ అభిమానులు, ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని ఎస్వీఎస్ మెడికల్ కళాశాల నుంచి ఏవీడీ థియేటర్ వరకు హీరో ప్రభాస్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. కల్కి సినిమా సక్సెస్‌పై డైరెక్టర్ నాగ్‌అశ్విన్ మాట్లాడుతూ తాను దర్శకత్వం వహించిన సినిమా ఇంతటి ఘన విజయం సాధించడంలో అభిమానులు కీలకపాత్ర పోషించారన్నారు. సినిమాకు రూ.1200 కోట్లు ఆదాయం వచ్చిందంటూ అభిమానులకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే కల్కి-2 సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తామని ప్రకటించారు.

బుజ్జి కారు ప్రత్యేకతలు..

బుజ్జి కారును మహబూబ్‌నగర్ తీసుకురావడానికి ప్రధాన కారణం డైరక్టర్ నాగ్‌అశ్విన్ సొంత జిల్లా కావడం. అభిమానుల కోరిక మేరకు ఇక్కడకు తీసుకొచ్చామని కల్కి సినిమా సంబంధీకుడు ఆనంద్ తెలిపారు. కారును ప్రత్యేకంగా మహేంద్ర కంపెనీ వాళ్లు కోయంబత్తూర్‌లో తయారు చేశారు. మూడు టైర్లు, ఆరు టన్నుల బరువుతో ఉన్న ఈ వాహనం ఎలక్ట్రికల్ బ్యాటరీతో నడిచే విధంగా తయారు చేశారన్నారు. ఒక్కసారి చార్జీతో యాభై కిలోమీటర్ల వరకు వెళ్తుందన్నారు. దీని సైజు 12 ఫీట్ల వెడల్పు, 19 ఫీట్ల పొడవు ఉంటుందని తెలిపారు. బుజ్జి కారును కల్కి పార్ట్-2లో వాడుకుంటామని పేర్కొన్నారు.



- సెల్ఫీలతో సందడి చేసిన యువత
- మూవీ సక్సెస్‌పై అభిమానులకు డైరెక్టర్ నాగ్‌అశ్విన్ కృతజ్ఞతలు

పంటలకు ప్రాణం

- విస్తారంగా కురుస్తున్న వర్షాలు
- ఓ వైపు వరి.. మరోవైపు మెట్ట పంటల జోరు

వనపర్తి, జూలై 23 : జిల్లాలో కొన్ని రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలు పంటలకు ప్రాణం పోస్తున్నాయి. జూలై రెండో వారం వరకు నల్లటి మబ్బులే కనిపించినా చినుకు జాడలేక పనులు ముందుకు సాగకపోవడంతో రైతులు దిగాలుచెందారు. అయితే గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు వ్యవసాయ రంగానికి ఊపిరిపోశాయి. దీంతో సాగు పనులు ఊపందుకోగా, వరి, పత్తితోపాటు మెట్ట పంటలు కళకళలాడుతున్నాయి.

వనపర్తి జిల్లాలో రైతులు వరితోపాటు పత్తినే అధికంగా సాగు చేస్తుంటారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలతోపాటు వరుస ముసురుతో ఈ ఏడాది సైతం రైతులు వరితోపాటు పత్తి సాగుకే ఎక్కువ మొగ్గు చూపారు. దీంతో మెట్టలో ప్రధానంగా పత్తి విస్తీర్ణం భారీగా పెరిగింది. వ్యవసాయశాఖ అధికారులు సైతం వరికి బదులు మెట్ట పంటలను, ముఖ్యంగా పత్తినే సాగు చేయాలని సూచిస్తున్నారు. ఈ ఏడాది కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుండగా, బోరు బావుల్లోకి పుష్కలంగా నీరు వస్తున్నది. దీంతో కొన్ని ప్రాంతాల రైతులు వరి సాగును వదులుకునేందుకు సిద్ధంగా లేరు. మైనర్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల కింద అత్యధికంగా వరే సాగవుతున్నది. నాన్ ఆయకట్టులో మెట్టపంటలతో పాటు వరి సాగు చేపట్టారు.

జిల్లాలో సాగవుతున్న పంటలు..

జిల్లాలో ఇప్పటివరకు వానకాలంలో సాగవుతున్న పంటల్లో పత్తి 11,367 ఎకరాలు, వరి 8,376, కందులు 2,913, మొక్కజొన్న 1,657, జొన్న 998, నువ్వులు 47, ఆముదం 217, వేరుశనగ 130, చెరుకు 79, ఉల్లిగడ్డ 263, మిర్చి 244, ఆయిల్‌పాం 140, ఇతర పంటలు 14 ఎకరాలు మొత్తంగా 26,460 ఎకరాల్లో సాగవుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురస్తుండడంతో పూర్తి స్థాయిలో పంటలు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

విస్తారంగా వర్షాలు..

కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పంటల సాగు ఊపందుకున్నది. రైతాంగం ఉత్సాహంగా సాగు పనుల్లో నిమగ్నమైంది. జిల్లాలో జూన్ 1నుంచి ఈ నెల22 వరకు 186 మి.మీ వర్షపాతానికి గానూ 336.2 మి.మీ వర్షం కురిసింది. ఇప్పటికే 84 మి.మీ వర్షం అధికంగా నమోదైంది. తాజాగా కురుస్తున్న వానలతో మెట్టపంటల సేద్యం ఊపందుకోనున్నది. అయితే అధికంగా వానలు కురిస్తే పత్తిపై ప్రభావం చూపించే అవకాశాలు లేకపోలేదు.

సాగుకు అనుకూలంగా వర్షాలు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటల సాగుకు అనుకూలంగా ఉన్నాయి. సకాలంలో వానలు పడుతుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. ప్రస్తుత సీజన్‌లో రైతులు సమయానికి విత్తనాలు వేశారు. వరి నారును కూడా సిద్ధం చేసుకున్నారు. జిల్లాలో ఎరువులు కూడా రైతులకు అందుబాటులో ఉన్నాయి.

- సుధాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, వనపర్తి